60 అడుగుల రోడ్డుకు మోక్షం!

- హైవే నుంచి బీఆర్టీఎస్‌కు అనుసంధానం
- ఎన్‌ఏడీ వద్ద ట్రాఫిక్ నియంత్రణపై దృష్టి
- ఉద్యోగులతో పాటు ప్రజలకు ఎంతో ఉపయోగం
- మూడు దశాబ్దాలుగా నలుగుతున్న సమస్య
- సీఎం దృష్టికి తీసుకెళ్లిన డిప్యూటీ మేయర్



అనుసంధానంగా శాంతినగర్‌కు ఉన్న 60 అడుగుల రహదారి



ఏళ్ల తరబడి విస్తరణకు నోచుకోని పాసుపోర్టు కార్యాలయం పక్కన ఉన్న రోడ్డు

విశాఖ విద్య: మూడు దశాబ్దాలుగా నలుగుతున్న సమస్యకు చెక్ పెట్టేలా కార్యాచరణ సిద్ధమవుతోంది. గత పాలకులు ఈ సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చినా నీటి మూటగానే మిగిలింది. అలాంటి సమస్యపై డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. కేంద్ర ప్రభుత్వ సంస్థతో ఉన్న స్థల సమస్యను ఇటీవల ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన నుంచి సానుకూల స్పందన రావడంతో సమస్యకు పరిష్కారం లభిస్తుందని అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఇదీ పరిస్థితి

హైవే నుంచి (పాస్‌పోర్టు కార్యాలయానికి ఆనుకొని) మద్రిపాలెం నేతాజీనగర్ మీదుగా బీఆర్టీఎస్ వైపు వెళ్లే రహదారిని 60 అడుగుల మేర విస్తరించాలనే డిమాండ్ మళ్లీ తెరపైకి వచ్చింది. డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ ప్రత్యేక చొరవ తీసుకొని ఇటీవల విశాఖ పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి రహదారి విస్తరణ చేపట్టాల్సిన ఆవశ్యకతపై విన్నవించారు.

మాస్టర్‌ప్లాన్‌లో భాగమే

ఎన్‌ఏడీ వద్ద మద్రిపాలెం వుడా లే అవుట్ నివాసానికి ఎంతో ఆహ్లాదకరంగా ఉంటుంది. విశాలమైన అంతర్గత రహదారులతో పరిసర కాలనీలు సుందరంగా కనిపిస్తాయి. అందుకే ఇక్కడ నివసించేందుకు అన్ని వర్గాల వారు ఎంతో ఆసక్తి చూపుతున్నారు. ఇదే చోట కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోని సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ, పాస్‌పోర్టు, ఫీఎఫ్ కార్యాలయాలతో పాటు, జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఉన్నాయి. విద్యా సంస్థలు కూడా ఎక్కువగానే ఉండడంతో ఈ ఏరియాలో రహదారులు రద్దీగా ఉంటాయి. దీన్ని దృష్టిలో ఉంచుకొని నేషనల్ హైవే నుంచి పాసుపోర్టు కార్యాలయం పక్కగా బీఆర్టీఎస్ రోడ్డుకు అనుసంధానంగా ప్రస్తుతం ఉన్న రహదారిని 60 అడుగల మేర విస్తరించాలని జీవీఎంసీ మాస్టర్‌ప్లాన్‌లో పొందుపరిచారు.

35 ఏళ్లుగా విన్నపాలు

పాసుపోర్టు కార్యాలయం పక్క నుంచి హైవే–బీఆర్టీఎస్ రోడ్డుకు ప్రస్తుతం కొన్ని చోట్ల 20 అడుగులు, కొంతమేర 30 అడుగుల రహదారి ఉంది. ఈ రహదారి సుమారు కిలోమీటర్ దూరం ఉంటుంది. దీనికి ఒకవైపు నివాస గృహాలు, మరో వైపు ఎయిర్‌పోర్టు అథారిటీకి చెందిన స్థలం ఉంది. దీన్ని 60 అడుగల మేర విస్తరించాలని 1989లో అప్పటి కమిషనర్ కె. రాజు ఎయిర్‌పోర్టు అథారిటీ వారికి నివేదించారు. అప్పటి నుంచి అనేకమార్లు జీవీఎంసీ నుంచి అనేకమార్లు ఎయిర్‌పోర్టు అథారిటీ వారికి ఉత్తరప్రత్యుత్తరాలు జరిగాయి. 35 ఏళ్లుగా విన్నపాలు ఇస్తున్నా సమస్యకు పరిష్కారం లభించలేదు. ఇప్పటికీ ఖాళీగా ఉన్న ఎయిర్‌పోర్టు అథారిటీ స్థలం రహదారి విస్తరణ కోసం ఇస్తే ప్రత్యామ్నాయంగా మరో చోట స్థలం కేటాయించేందుకు సైతం జీవీఎంసీ ద్వారా తీర్మానించారు. కానీ రహదారి విస్తరణకు మోక్షం కలగలేదు.

ఎన్‌ఏడీ వద్ద ప్రత్యామ్నాయ రహదారి

హైవేలో వచ్చే వాహనాలు మద్రిపాలెం వైపు ఎన్‌ఏడీ సెంటర్ ఫ్లై ఓవర్ మీదగా వెళ్లాలి. పాసుపోర్టు ఆఫీసు పక్క నుంచి బీఆర్టీఎస్ రహదారికి కనెక్టివిటీగా 60 అడుగుల రోడ్డు విస్తరిస్తే ఫ్లై ఓవర్ వరకు వెళ్లాల్సిన అవసరం లేకుండానే మద్రిపాలెం వైపు ప్రయాణించవచ్చు. కేంద్ర సంస్థల ఉద్యోగులతో పాటు ఈ రహదారికి ఇరువైపులా ఉన్న కాలనీ వాసుల రాకపోకలకు సౌలభ్యంగా ఉంటుంది. అందుకే దశాబ్దాల కాలంగా రోడ్డు విస్తరించాలని ఈ ప్రాంత వాసులు డిమాండ్ చేస్తున్నారు.

సీఎం సానుకూలంగా స్పందించారు



పాసుపోర్టు కార్యాలయం పక్క నుంచి ఉన్న రోడ్డును60 అడుగుల మేర విస్తరణ చేపట్టాల్సిన అవసరాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి విన్నవించాను. ఎంతో సానుకూలంగా స్పందించారు. పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మూడు దశాబ్దాలకు పైగా ఉన్న రహదారి విస్తరణ సమస్య పరిష్కారం అవుతుందనే నమ్మకం ఉంది.

–జియ్యాని శ్రీధర్, డిప్యూటీ మేయర్

ప్రజావసరాలను గుర్తించాలి



ప్రజల అవసరాలను కేంద్ర ప్రభుత్వం కూడా గుర్తించాలి. 60 అడుగుల రోడ్డు విస్తరణ కోసం ఎన్నో సంవత్సరాలుగా డిమాండ్ చేస్తున్నాం. స్థల సమస్య వల్లే రహదారి విస్తరణ జరగలేదు. ఇప్పటికైనా ఎయిర్‌పోర్టు అధికారులు పెద్దమనసు చేసుకొని స్థలం కేటాయించాలి. ప్రత్యామ్నాయంగా వేరే చోట స్థలం తీసుకోవాలి.

– బీఎస్.కృష్ణ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్

క్లుప్తంగా

ఏపీఎస్‌ఈబీ కాలనీ సమస్యలపై వినతి



రమణకు వినతిపత్రం అందజేస్తున్న కమిటీ పెద్దలు

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు ఏపీఎస్ ఈబీ కాలనీ సమస్యలపై కార్పొరేటర్ బొమ్మిడి రమణకు కాలనీ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు వినతి పత్రం అందజేశారు. నూతనంగా ఏర్పాటైన కాలనీ అసోసియేషన్ నాయకులు బుధవారం కార్పొరేటర్ బొమ్మిడి రమణను కలసి కాలనీ సమస్యలపై చర్చించారు. అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, సభ్యులు విల్లా సత్తిబాబు, సుధాకర్, శ్రీధర్, భాస్కర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

గంజాయితో ఇద్దరి అరెస్ట్

గోపాలపట్నం: గోపాలపట్నం శ్మశాన వాటిక వద్ద నాలుగు కిలోల గంజాయితో ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. గోపాలపట్నం ఎస్‌ఐ అప్పలనాయుడు తెలిపిన వివరాలు... ఏజెన్సీ ప్రాంతం నుంచి గంజాయి తీసుకు వచ్చి శ్మశానం వెనుక దారిలో నడిచి వెళ్తున్నారని స్పష్టమైన సమాచారం రావడంతో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. వారిని తనిఖీ చేయగా నాలుగు కిలోల గంజాయి బయటపడింది. కర్ణాటక రాష్ట్రానికి చెందిన గొంతోపల్లి వెంకటరాయప్ప, అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన శోభ దామోదర్‌లను అరెస్ట్ చేశారు. సీఐ సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేపట్టారు.

పంచగ్రామాల సమస్యపై దృష్టి



మాట్లాడుతున్న జీవీఎల్ నరసింహారావు

విశాఖ విద్య: పశ్చిమ నియోజకవర్గంలోని దీర్ఘకాలిక సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు చెప్పారు. ఎన్‌ఏడీలోని బీజేపీ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పంచ గ్రామాల సమస్యపై పార్లమెంట్‌లో ప్రస్తావించనున్నట్లు తెలిపారు. వారణాసి నుంచి విశాఖకు వారంలో రెండు రోజులు బెనారస్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 22 నుంచి ప్రారంభం కానుందన్నారు. దీన్ని ఈ ప్రాంత వాసులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పార్టీ నియోజకవర్గ కన్వీనర్ దాడి పురుషోత్తమ రమేష్ , నాయకులు జీసీ నాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి దిలీప్ వర్మ, జిల్లా ఇన్‌చార్జి గంగయ్య, భీశెట్టి నాని, పొలిమేర శ్రీనివాసరావు, సీహెచ్ మంజుల, నాదెళ్ల జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కూరాకుల సంఘం నాయకులు

మధురవాడ: కూరాకుల కులాన్ని రాష్ట్రంలో అన్ని చోట్లా బీసీ – ఏ జాబితాలో చేర్చినందుకు మధురవాడ మిథిలాపురి వుడా కాలనీలో ఆ కులానికి చెందిన పలువురు బుధవారం సంబరాలు చేసుకున్నారు. ప్రాంతీయ పరిధులు లేకుండా అందరికీ రిజర్వేషన్ కల్పించడం పట్ల హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. ఈ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చిత్రపటానికి విశాఖ జిల్లా కూరాకుల సంఘం ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. కార్పొరేషన్ డైరెక్టర్ కోట ఆనంద్ ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా బీసీ సంఘాల అధ్యక్షుడు మన్యాల శ్రీనివాస్, జీవీఎంసీ 8వ వార్డు కార్పొరేటర్ లొడగల అప్పారావు, వార్డు అధ్యక్షుడు గుడ్ల పోలిరెడ్డి, సచివాలయ కన్వీనర్ రమణమూర్తి, కూరాకుల సంఘం కార్యవర్గ సభ్యులు చోడవరపు వెంకటస్వామి, కోట సంజీవరావు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే సీఎం వైఎస్ జగన్ లక్ష్యం

- 89వ వార్డులో ఉత్సాహంగా 'ఏపీకి జగనే ఎందుకు కావాలంటే..'
- తరలివచ్చిన వైఎస్సార్‌సీపీ వార్డు నాయకులు



కిట్లు అందిస్తున్న అయితంశెట్టి గోపాలకృష్ణ, ఆళ్ల పైడిరాజు, గేదెల మురళీకృష్ణ



కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు ఆర్పీలు

గోపాలపట్నం: పేదల సంక్షేమమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని వైఎస్సార్‌సీపీ 89వ వార్డు నాయకుడు అయితంశెట్టి గోపాలకృష్ణ అన్నారు. బుధవారం 89వ వార్డు చేపల కాలనీలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. వార్డులో పార్టీ జెండాను ఎగురవేసి, అనంతరం ఇక్కడి కమ్యూనిటీ హాలు వద్ద సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గోపాలకృష్ణ మాట్లాడుతూ గత టీడీపీ హయాంలో అన్నీ స్కాములేనని, సంక్షేమాన్ని పట్టించుకోలేదని విమర్శించారు. హామీలు నెరవేర్చకుండా మేనిఫెస్టోని మాయం చేశారన్నారు. ప్రస్తుతం జగనన్న ప్రభుత్వంలో 99 శాతం హామీలు నెరవేర్చారన్నారు. 467 సచివాలయం పరిధిలో రూ.22.59 కోట్ల సంక్షేమ పథకాలు అందించారన్నారు. ఈ వార్డులో అభివృద్ధి పనులకు కోట్ల రూపాయలు వెచ్చించామని చెప్పారు. ప్రజల సంక్షేమం కోసం ఆలోచన చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి గేదెల మురళీకృష్ణ, జిల్లా కార్యదర్శి ఆళ్ల పైడిరాజు, ఏపీడీ శ్రీరామ్, పార్టీ నాయకులు మళ్ల శ్రీనివాసరావు, షేక్ రహమాన్, చిన్ని, తులసి, చరణ్, కూర్మారావు, మోహన్, ఆర్పీలు, గృహ సారథులు, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న తిరునక్షత్రం పూజలు



పూజలు నిర్వహిస్తున్న వైదికులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో మనవాళ్ మహా మునులు తిరునక్షత్రం పూజలు మూడోరోజు బుధవారం కొనసాగాయి. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను ఆలయ ఆస్థాన మండపంలోని వేదికపై అదిష్ఠింపజేశారు. అనంతరం దివ్యప్రబంధ పారాయాణం పఠించారు.

రేపు మెగా జాబ్‌మేళా

కంచరపాలెం: కంచరపాలెం జిల్లా ఉపాధి కార్యాలయంలోని నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో కర్లికల్, టెక్నికల్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 17న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి సిహెచ్.సుబ్బిరెడ్డి(క్లరికల్) ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అపోలో ఫార్మసీస్, వరుణ్ మోటర్స్, శ్రీరామ్ చిట్స్, ముత్తూట్ ఫైనాన్స్, టాటా క్యాపిటల్, దక్కన్ ఫైన్ కెమికల్స్, స్పెక్ట్రమ్ టాలెంట్ మేనేజ్‌మెంట్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీల్లో 500 ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు జరుగుతాయని తెలిపారు. రిటైల్ ట్రైనింగ్ అసోసియేట్, ఫార్మాసిస్ట్, జూనియర్ ట్రైనీ, డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్స్, ఫీల్డ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, ఆఫీస్ అసిస్టెంట్, అకౌంట్స్, అసిస్టెంట్, రికవరీ, క్లర్క్, బ్రాంచ్ ఇన్‌చార్జి, వేర్‌హౌస్ ఎగ్జిక్యూటివ్స్ ఉద్యోగాలకు టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, ఏదైనా డిగ్రీ, పీజీ, 18–35 ఏళ్ల వయసు గల పురుష, మహిళా అభ్యర్థులు అర్హులన్నారు. కంచరపాలెం జిల్లా ఉపాధి కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు జాబ్‌మేళాకు హాజరు కావాలని కోరారు.

డీసీఎస్ ఆర్ఎంవోకు పదోన్నతి

మహారాణిపేట : కేజీహెచ్ డిప్యూటీ సివిల్ సర్జన్ ఆర్ఎంవోగా పని చేస్తున్న డాక్టర్ ఎ.వాసుదేవకు పదోన్నతి లభించింది. సివిల్ సర్జన్ ఆర్ఎంవోగా పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. పుట్టపర్తి సత్యసాయి జిల్లా జాతీయ అంధత్వ నివారణ ప్రాజెక్టు చీఫ్‌గా ఆయనను నియమించారు. గత ఏడాది మే 4వ తేదీ నుంచి నుంచి డాక్టర్ వాసుదేవ కేజీహెచ్‌లో డీసీఎస్ ఆర్ఎంవోగా పని చేస్తున్నారు.

ఢిల్లీలో 24న ఆశ్ర జాతీయ సదస్సు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, ఆశ్ర ప్రతినిధులు

దాబాగార్డెన్స్: భారతదేశంలో అత్యంత ప్రతిష్టాత్మక వినియోగదారుల సంస్థ ఆశ్ర (అడ్వకేట్స్ అసోసియేషన్ ఫర్ సోషల్ రెస్పాన్సిబిలిటీ అండ్ అవేర్‌నెస్) 5వ జాతీయ సదస్సు ఈ నెల 24న దేశ రాజధాని ఢిల్లీలో నిర్వహించనున్నట్లు సంస్థ అంతర్జాతీయ అధ్యక్షుడు పాలమరశెట్టి రత్నరాజు తెలిపారు. ఈ మేరకు సదస్సుకు సంబంధించిన పోస్టర్‌ను ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ చేతుల మీదుగా ఆవిష్కరింపజేశారు. ఈ సందర్భంగా పాలమరశెట్టి మాట్లాడుతూ సెలబ్రిటీ గెస్ట్‌గా టాలీవుడ్ యాక్టర్ అలీ, భారతదేశ వినియోగదారుల సంఘం కార్యదర్శి రోహిత్‌కుమార్ సింగ్, అమెరికా ఆపరేషన్ హెడ్ హరికృష్ణ, సౌత్ కొరియా ఖనరీసస్ వ్యవస్థాపకుడు హంగ్‌సున్‌యంగ్, బాబూభాయ్, ఆర్ఆర్ టీమ్, ఖంటేయం తదితరులు హాజరు కానున్నారని చెప్పారు. ఆశ్రా మినిస్ట్రీ ఆఫ్ కన్స్యూమర్ అఫైర్స్ ఆధ్వర్యంలో గుర్తింపు పొందిన సంస్థగా దేశంలో సుమారు వెయ్యికి పైగా ప్రతినిధులతోనూ, చీఫ్ ప్యాట్రన్ సుప్రీం కోర్టు లాయర్ హబీన్ సుల్తాన్ అలీ నేతృత్వంలో దేశంలోని పది రాష్ట్రాల్లో నడుస్తుందన్నారు. జాతీయ స్థాయిలో వినియోగదారులకు అవగాహన కల్పించి వారికి ప్రతిభా అవార్డులు అందజేయనున్నట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు ఇక్బాల్ తెలిపారు. కార్యక్రమంలో ఈవెంట్ హెడ్ వీరూమామ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామి జయంత్యుత్సవాలు ప్రారంభం



వీరబ్రహ్మేంద్రస్వామికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ కామాక్షి ఏకాంబరేశ్వర సనాతన ధర్మపీఠం, సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం సింహాచలంలోని దేవస్థానం పుష్కరిణి సత్రం ప్రాంగణంలో శ్రీమద్ విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి జయంతి మహోత్సవాలు ఘనంగా ప్రారంభయ్యాయి. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపంలో వీరబ్రహ్మేంద్రస్వామి దంపతుల విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఉదయం 9 నుంచి గణపతిపూజ, కలశస్థాపన, పుణ్యాహవచనం, అఖండ దీపారాధన, పుష్పారాధన, మంగళ హారతి కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈనెల 20వతేదీ వరకు జయంతి మహోత్సవాలు జరుగుతాయని కామాక్షి ఏకాంబరేశ్వర సనాతన ధర్మపీఠం సేవా ట్రస్ట్ ప్రతినిధి సాంబమూర్తి తెలిపారు. దీనిలో భాగంగా ప్రతీరోజూ ఉదయం నిత్యపూజ ఉంటుందన్నారు. 17న సాయంత్రం 4.30గంటల నుంచి అమ్మవారి కుంకుమపూజ, 18న సాయంత్రం 4.30గంటల నుంచి వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణోత్సవం, 19న సాయంత్రం 6గంటల నుంచి స్వామివారి సమాధి ఘట్టం, అఖండ దీపారాధన, 20న మధ్యాహ్నం 12గంటల నుంచి అన్న సమారాధన, సాయంత్రం 4గంటల నుంచి స్వామివారి ఊరేగింపు జరుగుతాయని తెలిపారు. భక్తులంతా ఈకార్యక్రమాల్లో పాల్గొని తరించాలని కోరారు.

ఒడిశా వాసి ఆత్మహత్య

పెదగంట్యాడ: ఒడిశాకు చెందిన ఓ యువకుడు మంగళవారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. న్యూపోర్టు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అభినాష్ సాహు (22) అనే యువకుడు తల్లిదండ్రులు, సోదరుడితో కలసి భానోజీతోట రోడ్డు నంబర్–6లోని ఓ అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నాడు. కోరమాండల్‌లోని ఓ కాంట్రాక్టర్ వద్ద ఆరు నెలలుగా ఎలక్ట్రికల్ పనులు చేసుకుంటున్నాడు. రోజూ మాదిరిగానే మంగళవారం విధులకు వెళ్లి వచ్చిన అభినాష్ రాత్రి 9 గంటల సమయంలో ఇంట్లోని ఓ బెడ్‌రూమ్‌లో నిద్రపోయాడు. వేకువజామున 5 గంటల సమయంలో అతని తల్లి నిద్రలేచి చూడగా అతడి గది లోపల గడియపెట్టి ఉంది. తలుపు తట్టినా తీయకపోవడంతో కిటికీలో నుంచి చూడగా చీరతో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని కనిపించాడు. ఆమె రోదిస్తూ మిగిలిన కుటుంబ సభ్యులను లేపడంతో పాటు చుట్టుపక్కల వారు వచ్చి తలుపు విరగ్గొట్టి అతడిని కిందకు దింపారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని, మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. 'తనతో పాటు తన సోదరుడు కూడా కోరమాండల్‌లో ఓ కాంట్రాక్టర్ వద్ద పని చేస్తున్నాడని, పని ఒత్తిడి కారణంగా రోజూ ఒళ్లు నొప్పులు వస్తుంటాయని, అలాగే.. తమ సోదరి పెళ్లి కోసం అప్పులు చేశామని, తీవ్ర ఒత్తిడికి లోనై తన సోదరుడు ఆత్మహత్య చేసుకున్నాడని' మృతుడి సోదరుడు దుష్మంత్ సాహు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఏఎస్‌ఐ రాజు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గ్రంథాలయాలను బలోపేతం చేయాలి



కార్యక్రమంలో పాల్గొన్న పబ్లిక్ లైబ్రరీ అభివృద్ధి సంస్థ చైర్మన్ పి.ఎస్.ఎన్.మూర్తి



సెయింట్ ఆన్స్ కళాశాలలో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శన

మల్కాపురం: గ్రంథాలయాలను అభివృద్ధి చేయడం సామాజిక బాధ్యత అని, గ్రంథాలయాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పబ్లిక్ లైబ్రరీ అభివృద్ధి సంస్థ చైర్మన్ పి.ఎస్.ఎన్.మూర్తి అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మల్కాపురం శాఖ గ్రంథాలయంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. భారీ,చిన్న పరిశ్రమల యాజమాన్యాలు గ్రంథాలయాల అభివృద్ధిని సామాజిక బాధ్యతగా తీసుకుని అభివృద్ధి పరచాలన్నారు. ములగాడ మండల విద్యాధికారి ఎల్.వెంకటరావు గ్రంథాలయాల గొప్పతనాన్ని వివరించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి అజేయ్‌కుమార్,జిల్లా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

- మల్కాపురం సెయింట్ ఆన్స్ మహిళా కళాశాల గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన నిర్వహించారు. పలు పుస్తకాలను ప్రదర్శనలో ఉంచారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రూ.10కే 'కోరమాండల్' వైద్యం

- శాంతినగర్‌లో ఆస్పత్రి ఏర్పాటు
- ప్రారంభించిన డీఎంహెచ్‌వో



ఆస్పత్రి ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు, అధికారులు

మల్కాపురం: పేదలకు రూ.10కే వైద్యం అందించేందుకు కోరమాండల్ ఇంటర్నేషనల్ సంస్థ ముందుకు రావడం అభినందనీయమని డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు అన్నారు. కోరమాండల్ సహకారంతో స్థానిక శాంతినగర్‌లో ఏర్పాటు చేసిన ఆస్పత్రిని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ఈ ఆస్పత్రిలో పలువురు నిష్ణాతులైన వైద్య నిపుణులు సేవలు అందిస్తుండడం మంచి పరిణామమన్నారు. కోరమాండల్ సంస్థ అధికారి ఎం.జ్ఞానసుందరం మాట్లాడుతూ ఈ ఆస్పత్రిలో ఆర్థో, గైనిక్, చిల్డ్రన్, చర్మం, గుండెకు సంబంధించిన వైద్య నిపుణులతో పాటు జనరల్ ఫిజిషియన్ నిత్యం అందుబాటులో ఉంటారన్నారు. అలాగే మందులపై 80 శాతం వరకు రాయితీ కల్పిస్తున్నామని చెప్పారు. రక్త పరీక్షలకు 40 శాతం రాయితీ ఉంటుందని, రూ.50కు ఈసీజీ, ఎక్స్‌రే, తదితర సౌకర్యాలు ఇక్కడ రోగుల అవసరార్థం కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ గులిగిందల లావణ్య, డిస్ట్రిక్ ఎడ్యుకేషన్ మీడియా ఆఫీసర్ నాగేశ్వరరావు, కోరమాండల్ యూనిట్ హెడ్ ఆర్.శ్రీనివాసరావు, డీజీఎం(హెచ్ఆర్) జయగోపాల్, సీఎస్ఆర్ హెడ్ డాక్టర్ ఉదయ్, సీఎస్ఆర్ డిప్యూటీ మేనేజర్ నారాయణపాత్రుడు, హేమంత్, ఎస్.వెంకటరమణ, శ్రీకాంత్, శర్మ, తదితరులు పాల్గొన్నారు.

కార్మిక సంక్షేమం ఇంటక్‌తోనే సాధ్యం



మాట్లాడుతున్న ఇంటక్ ప్రధాన కార్యదర్శి అభ్యర్థి శ్రీరామమూర్తి

మల్కాపురం: షిప్‌యార్డ్ కార్మికుల సంక్షేమానికి తమ యూనియన్ నిరంతరం శ్రమిస్తుందని.. అందుకు ఉదాహరణ తమ యూనియన్ హయాంలో కార్మికులకు జరిగిన మేలే అని ఇంటక్ ప్రధాన కార్యదర్శి అభ్యర్థి పైలా శ్రీరామమూర్తి అన్నారు. ఈ నెల 18న షిప్‌యార్డ్ గుర్తింపు యూనియన్ ఎన్నిక సందర్భంగా ఆవరణలో బుధవారం జోరుగా ప్రచారం నిర్వహించారు. ఇంటక్ నాయకులు ఫ్యాబ్రికేషన్ డిపార్ట్‌మెంట్ వద్ద కార్మికులతో కలిసి సమావేశం నిర్వహించారు. ప్రధాన కార్యదర్శి అభ్యర్థి శ్రీరామమూర్తి మాట్లాడుతూ లేనిది ఉన్నట్టు,ఉన్నది లేనట్టు చెప్పే నైజం ఇంటక్‌ది కాదన్నారు. కార్మికులు ఆలోచన చేసి ఇంటక్ విజయానికి సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఇంటక్ అధ్యక్ష అభ్యర్థి పి.జె.హెచ్ బోస్,డిప్యూటీ గౌరవ అధ్యక్షుడు మాణిక్యాలరావు,గణేష్,డి.వి.రమణ,ఎన్.ధనంజయ్,శామ్యూల్,ఎం.లక్ష్మణరావు, ధమ్ము శ్రీను,ఎస్.కే.మదీన వల్లి, బి.రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

25 ఏళ్లుగా సేవా కార్యక్రమాలు

రౌండ్ టేబుల్ ఇండియా ఏరియా 9 చైర్మన్ విక్రాంత్ హనుమంతు



దాతలతో రౌండ్ టేబుల్ ఇండియా ఏరియా 9 ప్రతినిధులు

తాటిచెట్లపాలెం: గత 25 ఏళ్లుగా రౌండ్ టేబుల్ ఇండియా నిస్వార్థమైన సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ విద్యతో స్వేచ్ఛ అనే లక్ష్యంతో పనిచేస్తోందని ఏరియా 9 చైర్మన్ విక్రాంత్ హనుమంతు తెలిపారు. రైల్వే స్టేషన్ రోడ్‌లోని బెస్ట్ వెస్టన్ ప్లస్ తేజ్ వివాన్ హోటల్‌లో బుధవారం సంస్థ 25వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ సంస్థ మెరుగైన మౌలిక సదుపాయాల కల్పన, పేద పిల్లలకు విద్యను అందించడానికి కృషి చేస్తోందని చెప్పారు. సుమారు రూ.437 కోట్ల వ్యయంతో 3,616 ప్రాజెక్టులను చేపట్టిందని, వీటిలో 9.53 మిలియన్ పిల్లలకు ఉపయోగపడేలా 8,665 తరగతి గదులు నిర్మించినట్లు వెల్లడించారు. తమ సంస్థ వారోత్సవాల్లో భాగంగా పిల్లలకు ఎంటర్‌టైన్‌మెంట్, మధ్యాహ్న భోజనం, దాతలకు సత్కారం , రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో రక్తదాన శిబిరం, బీచ్ క్లీనింగ్ వంటి కార్యక్రమాలను ఈ ఏడాది నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా సంస్థకు సహాయ సహకారాలు అందించిన దాతలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రౌండ్ టేబుల్ ఏరియా 9 వైస్ చైర్మన్ మక్సూద్ అహ్మద్, ప్రాజెక్ట్ కన్వీనర్ సందీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతోనే బాల్యవివాహాలకు బ్రేక్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న జేసీ విశ్వనాథన్, న్యాయమూర్తి శేషమ్మ, తదితరులు

మహారాణిపేట: చట్టాలపై అవగాహనతోనే బాల్య వివాహాలను అరికట్టగలమని జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్ పేర్కొన్నా రు. జేసీ అధ్యక్షతన బుధవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో సంబంధిత అధికారులతో బాల్యవివాహాల నివారణపై సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని, ఎవరైనా వీటికి పాల్పడినా.. సహకరించినా కఠిన శిక్షలు తప్పవని హెచ్చరించారు. వివాహ సమయంలో అమ్మాయిలకు 18 ఏళ్లు, అబ్బాయిలకు 21 ఏళ్లుగా పేర్కొంటూ వయసు నిర్ధారణ పత్రాలు ఉండాల్సిందేనని స్పష్టం చేశారు. దీనిపై అధికారులు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. ఫంక్షన్ హాళ్లు, దేవాలయాలు, చర్చిలు, మసీదులు, ఇతర వేదికల వద్ద వివాహ వయసును ధ్రువీకరించే పత్రాలను సమర్పిస్తేనే అక్కడ పెళ్లి చేసేందుకు అనుమతి ఇవ్వాలన్నారు. బాల్యవివాహాలు చేస్తున్నట్లు సమాచారం అందితే.. నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పెళ్లి వేదికల వద్ద బోర్డులు ఏర్పాటు చేసి బాల్యవివాహాల దుష్ప్రభావాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వివాహం చేసుకున్న దంపతులు చట్టబద్ధంగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జేసీ సూచించారు. అనంతరం బాలల హక్కుల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో డీఎల్ఎస్ఏ జిల్లా కార్యదర్శి, న్యాయమూర్తి ఎం.వి.శేషమ్మ, డీఆర్వో కె.మోహన్ కుమార్, డీఎల్డీవో పూర్ణిమాదేవి, ఐసీడీఎస్ పీడీ వెంకటేశ్వరి, దిశ డీఎస్పీ సీహెచ్.వివేకానంద, డీఈవో చంద్రకళ, ఎన్జీఓలు, అధికారులు పాల్గొన్నారు.